

కలో గంజో కలిసి తాగుతూ

ఇక్కడే ఉందాం

- కిర్గిస్తాన్ నుంచి ఇంటికి చేరిన బాధితుడిని చూసి తల్లి కన్నీరు

దుబ్బాక, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): 'బిడ్డా.. నీవెక్కడికి పోవద్దు. కలోగంజో కలిసి తాగుతూ ఇక్కడే ఉందాం' అని కన్నీటిపర్యంతమయ్యారు దుబ్బాక మండలం బల్వంతాపూర్ గ్రామానికి చెందిన సౌడ రజనీకాంత్ తల్లి వరవ్వ. కడుపు చూసే వారు లేని దేశంలో ఉండటం కంటే, డబ్బులు లేకపోయినా కలిసి ఉండటమే ముఖ్యమని ఆమె భావోద్వేగానికి లోనయ్యారు. పని నిమిత్తం కిర్గిస్తాన్ వెళ్లి బందీగా ఉండి విడుదలైన రజనీకాంత్ ఆదివారం తన స్వగ్రామం చేరుకున్నారు. ఈ సందర్భంగా కుమారుడిని చూసి ఆమె కన్నీటిపర్యంతమయ్యారు. 'నన్ను వదిలి ఎక్కడికీ పోవద్దు. డబ్బులు పోయినా పర్లేదు. బతుకుంటే మళ్లీ సంపాదించుకోవచ్చు. పుస్తెల తాడు అమ్మి నిన్ను తిరిగి తెచ్చుకున్నాను. మళ్లీ బతికినట్టయింది' అని ఆమె కుమారుడిని హత్తుకుని అన్నారు. కంపెనీకి లక్ష రూపాయలు చెల్లించగానే తన పాస్‌పోర్ట్ ఇచ్చారని, తినడానికి అనుమతించారని రజనీకాంత్ తెలిపారు. అక్కడి నుంచి కిర్గిస్తాన్ చేరుకుని మస్కట్ ఫ్లైట్ ఎక్కి, ఆ తర్వాత భారత్‌కు చేరుకున్నానని, హైదరాబాద్‌లో దిగి బస్ ఎక్కగానే ప్రాణం తిరిగి వచ్చినట్టు అనిపించిందని రజనీకాంత్ తెలిపారు. తాను సుమారు మూడు లక్షలు నష్టపోయానని, అయితే తిరిగి తన తల్లిని, భార్య, పిల్లలను చూస్తానని అనుకోలేదని వాపోయాడు. తిండిలేక పస్తులు ఉన్న సమయంలో, దుబ్బాక విలేకరులు రాసిన కథనాలతోనే తాను ధైర్యం తెచ్చుకుని బతికి బయటపడ్డానని రజనీకాంత్ 'ఆంధ్రజ్యోతి'కి కృతజ్ఞతలు తెలిపారు.

మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో మెదక్ జిల్లాలోని చెరువులు, కుంటలు నిండుకుండల్లా మారాయి. ఎండిపోయి ఎడారిలా మారిన జల వనరులు మళ్లీ జీవం పోసుకున్నాయి. ప్రాజెక్టుల్లోకి కొత్త నీరు వచ్చి చేరుతుండటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. దీంతో పంటలకు అవసరమైన సాగునీటితో పాటు తాగునీటి కష్టాలు కూడా తీరాయి. ఇప్పటివరకు జిల్లాలో 39 చెరువులు అలుగు పారుతుండగా, ఘనపూర్ ప్రాజెక్టు నుంచి మరో 21 చెరువులకు నీటిని విడుదల చేస్తున్నారు.



చెరువులకు జలకళ

మెదక్ జిల్లాలో నిండుతున్న చెరువులు

పల్లెల్లో సాగు సందడి.. రైతుల్లో ఆనందం

అలుగు పారుతున్న 39 చెరువులు

ఘనపూర్ నుంచి 21 చెరువులకు నీరు



పాపన్నపేట మండలం కుర్తివాడలో అలుగు పారుతున్న చెరువు

మెదక్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాల పరిధిలో అనేక చెరువులు, కుంటలు వర్షపు నీటితో నిండిపోయాయి. జిల్లాలోని మొత్తం 2,632 చెరువుల్లో, 39 చెరువులు అలుగు పారుతున్నాయని నీటిపారుదల శాఖ డీఈ నాగరాజు తెలిపారు. ఇందులో హవేళీఘనపూర్ మండలంలోని ముత్తాయిపల్లి చెరువు, కూచన్‌పల్లిలోని ఊరచెర్వు, మగ్దుంపూర్‌లోని పోతాయికుంట, పాపన్నపేట మండలంలోని ఎల్లాపూర్ విఠల్ చెరువు వంటివి ప్రధానమైనవి. గొలుసుకట్టు చెరువులన్నీ నిండటంతో సమీపంలోని పంట పొలాల్లో భూగర్భ జలమట్టాలు పెరిగాయని రైతులు చెబుతున్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌కు ఇకపై నీటి కొరత ఉండదని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

చెరువుల్లో నీటి శాతం ఇలా..

జిల్లా నీటి పారుదల విభాగం అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, వర్షాలకు ఇప్పటివరకు 132 చెరువుల్లో 75-100 శాతం నీరు నిండింది. 257 చెరువుల్లో 50-75 శాతం నీరు, 495 చెరువుల్లో 25-50 శాతం నీరు, ఇంకా 1709 చెరువుల్లో 0-25 శాతం నీరు చేరింది. రానున్న రోజుల్లో మరింత భారీ వర్షాలు కురిస్తే అన్ని చెరువులు పూర్తిగా నిండే అవకాశాలు ఉన్నాయని అధికారులు వివరించారు.

నిండుకుండలా ఘనపూర్ వనదుర్గా ప్రాజెక్టు

మెతుకుసీమలో ఉన్న ఏకైక మధ్యతరహా ప్రాజెక్టు ఘనపూర్ వనదుర్గా ఆనకట్ట పూర్తిగా నిండింది. 0.135 టీఎంసీల నిల్వ సామర్థ్యం ఉన్న ప్రాజెక్టు ప్రస్తుతం నిండుకుండలా అలుగు పారుతున్నది. ప్రస్తుతం ఈ ప్రాజెక్టు నుంచి పాపన్నపేట, కొల్చారం, హవేళీఘనపురం మండలాల పరిధిలోని 25 వేల ఎకరాల ఆయకట్టుకు నీరు విడుదల చేస్తున్నారు.

ప్రాజెక్టు ఎత్తు పెంపులో జాప్యం

ఘనపూర్ వనదుర్గా ప్రాజెక్టు ఎత్తును 1725 మీటర్లకు పెంచి, నీటి సామర్థ్యాన్ని 0.3 టీఎంసీలకు పెంచే పనులు ఆరు సంవత్సరాలుగా నిలిచిపోయాయి. ఎత్తు పెంచడం వల్ల ముంపునకు గురవుతున్న 191 ఎకరాల భూములకు నష్టపరిహారం చెల్లించడంలో జాప్యం జరుగుతోంది. ఆరు గ్రామాల రైతులు తమ భూములకు మార్కెట్ రేటు ప్రకారం పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే ఇప్పటివరకు 42 ఎకరాలకు పరిహారం చెల్లించినట్లు అధికారులు తెలిపారు. ఈ సమస్య పరిష్కారమైతే ప్రాజెక్టు సామర్థ్యం పెరిగి మరిన్ని ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఉంటుంది.

మెరుగైన పంటల సాగు అవకాశాలు

జిల్లా వ్యాప్తంగా వర్షాలకు భూగర్భ జలాలు పెరుగుతున్నాయని అధికారులు, జియాలజిస్టులు పేర్కొంటున్నారు. జిల్లా వ్యాప్తంగా 75 శాతం రైతులు బోరు బావుల ఆధారంగానే వ్యవసాయ సాగు చేస్తున్నారు. ప్రస్తుతం కురుస్తున్న

మిగతా 8వ పేజీలో



కోహీర్‌లో నారింజ వాగు పొంగిపొర్లడంతో పంట పొలాల్లోకి చేరిన వర్షపు నీరు

విస్తారంగా వర్షాలు

మెదక్/హవేళీఘనపూర్/తూప్రాన్/పెద్దశంకరంపేట/కోహీర్/ ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లావ్యాప్తంగా మూడు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఆదివారం అత్యధికంగా రామాయంపేటలో 91.0 మి.మీల వర్షపాతం కురిసింది. మనోహరాబాద్‌లో 90.6, పెద్దశంకరంపేటలో 90, నర్సాపూర్‌లో 73, వెల్దుర్తిలో 63.3, చిలప్‌చేడ్‌లో 60.8, కౌడిపల్లిలో 63.8, చేగుంటలో 59.8, మాసాయిపేటలో 53, టేక్మాల్‌లో 55, పాపన్నపేటలో 52.4 మి.మీ.ల వర్షపాతం నమోదైంది. మరో మూడు రోజులు వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరించింది. మెదక్-కామారెడ్డి జిల్లాల సరిహద్దులో ఉన్న పోచారం పాజెక్టు నిండుకుండలా మారింది. ఇంకో అడుగు నీరు వస్తే పొంగిపొర్లుతుంది. రెండు రోజులు సెలవులు రావడంతో ప్రాజెక్టును చూసేందుకు పర్యాటకులు భారీగా తరలివచ్చారు. తూప్రాన్ మండలంలోని హల్దీవాగులో ప్రవాహం పెరగడంతో చెక్‌డ్యాంలు పొంగిపొర్లుతున్నాయి.

- కోహీర్ మండలంలో నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నారింజ వాగు పొంగిపొర్లుతున్నది. పలు గ్రామాల్లో నారింజ పరివాహక ప్రాంతాల్లో పంట పొలాల్లో వర్షపు నీరు చేరింది. సజ్జాపూర్‌లో అల్లం, అరటి తోటల్లో నీరు నిలిచింది. బిలాల్‌పూర్ గ్రామం, పీచేర్యాగడి పాత తండాలో ఇళ్లలోకి వర్షం నీరు చేరింది. వరుసగా కురుస్తున్న వర్షాలకు ప్రజలు ఇబ్బందిపడుతున్నారు.

రూ. లక్షల్లో జీతం... అయినా

వదలని డ్రగ్స్ భూతం!

అక్రమ సంపాదనకు మత్తు దందా

- మత్తుకు బానిసలుగా ఉద్యోగులు
- తోటి ఉద్యోగులకూ సరఫరా
- చాక్లెట్లు, సిగరెట్ల రూపంలో విక్రయం
- పక్కరాష్ట్రాల నుంచి స్మగ్లింగ్
- సరిహద్దులు దాటుతున్న డ్రగ్స్, గంజాయి
- రవాణా చేస్తూ పట్టుబడుతున్న ఉద్యోగులు

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం.. లక్షల్లో జీతం.. అదీ సరిపోక అక్రమ మార్గంలో డబ్బు సంపాదించడం కోసం తోటి ఉద్యోగులకు డ్రగ్స్ సరఫరా చేశాడు ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. పూణే నుంచి హైదరాబాద్‌కు వాహనంలో డ్రగ్స్‌ను తీసుకెళ్తుండగా సంగారెడ్డి ఎక్సైజ్ పోలీసులకు పట్టుబడ్డాడు. జమ్ముకాశ్మీర్‌కు చెందిన హర్షత్ సింగ్ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. డ్రగ్స్‌కు బానిసగామారి జీతం సరిపోక తోటి ఉద్యోగులకు డ్రగ్స్ విక్రయించడం ప్రారంభించాడు. పూణే నుంచి డ్రగ్స్‌ను హైదరాబాద్‌కు తీసుకువస్తుండగా జనవరి 17న సంగారెడ్డి ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడు తరలిస్తున్న డ్రగ్స్ విలువ రూ.21.06లక్షలు ఉంటుందని పోలీసులు అంచనా వేశారు.

సంగారెడ్డి పట్టణానికి చెందిన కొమ్ముల రాజు (46) జిల్లా కోర్టులో హోంగార్డుగా పనిచేస్తున్నాడు. కొండాపూర్ మండలం మల్లేపల్లిలోని బీరు కంపెనీలో పనిచేస్తున్న విజయ్‌తో కలిసి డ్రగ్స్ విక్రయించేవాడు. కంది మండల శివారులోని ఓ హోటల్ వద్ద గంజాయి విక్రయిస్తుండగా జూలై 20న పోలీసులు పట్టుకున్నారు. 800 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

సంగారెడ్డి క్రైం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మంచి ఉద్యోగాలు చేస్తూ, లక్షల్లో జీతాలు తీసుకుంటున్నా కొందరు ఉద్యోగులు అక్రమాలకు పాల్పడుతున్నారు. జల్సాలకు అలవాటుపడి, డ్రగ్స్‌కు బానిసలై, అక్రమంగా డబ్బు సంపాదించాలనే దురాశతో డ్రగ్స్ వ్యాపారులుగా మారుతున్నారు. ఈ దురాశే వారిని కటకటాల పాలు చేస్తోంది.

సంగారెడ్డి జిల్లాలో డ్రగ్స్ మహమ్మారి రాజ్యమేలుతోంది. పోలీసులు గట్టి చర్యలు తీసుకుంటున్నా, స్మగ్లర్లు కొత్త దారులు వెతుక్కుంటున్నారు. ముఖ్యంగా ఒడిశాలోని మల్కాన్‌గిరి నుంచి గంజాయిని తీసుకువచ్చి, సంగారెడ్డి జిల్లాలోని జహీరాబాద్ సరిహద్దుల మీదుగా మహారాష్ట్రలోని ముంబై, పూణే, లాతూర్ వంటి ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఇందులో కొంత భాగాన్ని జిల్లాలోని వ్యక్తులకు అప్పగించి, కాలేజీలు, మార్కెట్లలో విక్రయిస్తున్నారు.

చాక్లెట్లు, సిగరెట్ల రూపంలో సరఫరా

గంజాయి ప్యాకెట్ల రవాణా కష్టం కావడంతో, స్మగ్లర్లు చాక్లెట్లు, సిగరెట్ల రూపంలో గంజాయిని తయారు చేసి గుట్టుగా విక్రయిస్తున్నారు. జిల్లాలోని పలు ఇంజినీరింగ్ కాలేజీలు, ముఖ్యంగా చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్‌లోని జేఎన్‌టీయూ, పటాన్‌చెరులోని గీతం విశ్వవిద్యాలయం వంటి చోట్ల విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని ఈ దందా సాగుతోంది. గతంలో ఈ ప్రాంతాల్లో పోలీసులు పెద్ద మొత్తంలో గంజాయి చాక్లెట్లను స్వాధీనం చేసుకున్నారు.



జహీరాబాద్ చెక్‌పోస్టు వద్ద పట్టుబడిన గంజాయి (ఫైల్)

ఉద్యోగుల మత్తు దందా

కొందరు సాఫ్ట్‌వేర్, ఇతర ఉద్యోగులు కూడా ఈ వ్యాపారంలో పాలు పంచుకుంటున్నారు. తమ జీతం జల్సాలకు సరిపోకపోవడంతో తోటి ఉద్యోగులకు డ్రగ్స్ అలవాటు చేసి, అక్రమ సంపాదనకు పాల్పడుతున్నారు. డ్రగ్స్ రవాణా, విక్రయ కేసుల్లో పట్టుబడిన ఉద్యోగులు తమ భవిష్యత్‌ను నాశనం చేసుకోవడమే కాకుండా, వారి కుటుంబ సభ్యులకు కూడా చెడ్డపేరు తెస్తున్నారు.

గంజాయి నిర్మూలనకు చర్యలు



గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నాం. సరిహద్దు ప్రాంతాల్లో తనిఖీలు ముమ్మరం చేశాం. యువత, ఉద్యోగులు ఈ వ్యసనాలకు దూరంగా ఉండాలని, లేకపోతే వారి జీవితాలు జైలుపాలవుతాయి. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా కాలేజీలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఎక్కడైనా గంజాయి రవాణా లేదా విక్రయాలు జరిగితే టీ-న్యాబ్ 8712656777 నంబర్‌కు ఫోన్ లేదా వాట్సాప్ ద్వారా సమాచారం ఇవ్వాలి.

-పరితోష్ పంకజ్, సంగారెడ్డి ఎస్పీ



రూ.కోట్లు విలువైన

భూములకు ఎసరు..!

జాతీయ రహదారి పక్కన ఆక్రమణలు

రాత్రికి రాత్రే వెలిసిన అక్రమ నిర్మాణాలు

రాజకీయ నాయకుల అండదండలు

పట్టించుకోని రెవెన్యూ అధికారులు

కంది, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : కంది మండలంలో హైవే పక్కన ఉన్న భూములు యథేచ్ఛగా ఆక్రమణకు గురవుతున్నాయి. రూ.కోట్లు విలువైన స్థలాల్లో అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయి. చేర్యాల గేటు వద్ద సర్వే నంబర్ 448, 449, 450, 451లో దాదాపు 155 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. జాతీయ రహదారి పక్కనే ఉన్న భూమిపై కబ్జాదారులు కన్నేశారు. ఆదివారం రాత్రికి రాత్రి చేర్యాల గేటు వద్దనున్న ప్రభుత స్థలంలో టిఫిన్ సెంటర్లను ఏర్పాటు చేశారు. 200 గజాల చొప్పున స్థలాలను శుభ్రం చేసి గుడిసెలు వేశారు.

రూ. కోట్లు విలువైన ప్రభుత్వ స్థలాలకు ఎసరు

జాతీయ రహదారి విస్తరణ పనులు జరుగుతుండడంతో ఇక్కడి భూములకు డిమాండ్ పెరిగింది. హైవే పక్కనే ఉన్న భూములకు గజం రూ.40 వేల నుంచి రూ.60 వేల వరకు పలుకుతున్నాయి. దీంతో కొందరు కబ్జాదారులు రాజకీయ నాయకుల అండదండలతో కబ్జాలకు పాల్పడుతున్నారు. వరుసగా మూడు రోజుల పాటు సెలవులు రావడంతో ఆక్రమణదారులు రెచ్చిపోయారు. రూ. కోట్లు విలువైన ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురవుతున్నా రెవెన్యూ యంత్రాంగం మాత్రం పత్తా లేదు.

కేసులు నమోదు చేస్తాం

-రవికుమార్, తహసీల్దార్

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే వాల్లా చట్టం కింద క్రిమినల్ కేసులు పెడతాం. ప్రభుత్వ స్థలాల్లో అక్రమంగా నిర్మించిన గుడిసెలు, రేకులషెడ్లను కూల్చివేస్తాం. కంచె వేయించి సూచికల బోర్డులు పెట్టిస్తాం.

డెంగ్యూతో బాలిక మృతి

జోగిపేట రూరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): డెంగ్యూతో బాలిక మృతిచెందిన సంఘటన సంగారెడ్డి జిల్లా జోగిపేటలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణానికి చెందిన బాలిక 10 రోజులుగా తీవ్ర జ్వరంతో బాధపడుతోంది. చికిత్స నిమిత్తం జోగిపేటలోని ఏరియా ఆస్పత్రిలో చేర్పించగా పరీక్షించిన వైద్యులు డెంగ్యూగా నిర్ధారించారు. మెరుగైన చికిత్స కోసం బాలికను సంగారెడ్డిలోని జిల్లా ఆస్పత్రికి, అక్కడి నుంచి శనివారం హైదరాబాద్‌లోని నిలోఫర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతిచెందింది.

పంద్రాగస్టు నుంచి ప్రీప్రైమరీ

సంగారెడ్డి జిల్లాలో 58 సర్కారు బడుల్లో ప్రారంభించేందుకు ఏర్పాట్లు

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): సర్కారు బడుల్లో ప్రీ ప్రైమరీ తరగతులు ప్రారంభించేందుకు విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. సంగారెడ్డి జిల్లాలోని 58 ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ తరగతులు ప్రారంభించేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఇందుకోసం ఇప్పుడున్న పాఠశాలల్లో ప్రత్యేక గది కేటాయించాలని ప్రధానోపాధ్యాయులను కోరింది. ఆ గదిని ఆహ్లాదకరంగా ఉండేలా అలంకరించనున్నారు, అక్షరాలు, బొమ్మలతో గోడలను తీర్చిదిద్ది చిన్నారులను ఆకట్టుకునేలా గదిని మార్చనున్నారు. చిన్నారులకు అవసరమైన ఫర్నీచర్ సమకూర్చాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. నిర్వహణను పంచాయతీ సహకారంతో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు పర్యవేక్షించనున్నాయి. వచ్చే ఏడాది ఒకటో తరగతిలో ప్రవేశాలు పొందాలనుకే విద్యార్థులను ప్రస్తుత ఏడాది ప్రీప్రైమరీలో ప్రవేశాలివ్వనున్నారు. వచ్చే ఏడాది ఒకటో తరగతిలో చేరేలా చిన్నారులకు కనీస అభ్యసన సామర్థ్యాలు, సంసిద్ధతా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. పంద్రాగస్టు నుంచి ప్రీ ప్రైమరీ తరగతులు ప్రారంభించాలని సర్కారు ఆదేశించడంతో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ, వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖలతో సమన్వయం చేసుకుంటూ విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తున్నది.

ప్రారంభానికి ఏర్పాట్లు చేస్తున్నాం

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ తరగతుల ప్రారంభానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. ఈ నెల 15 వ తేదీ లోపు అన్ని ఏర్పాట్లు చేసి ప్రారంభించాలనే ఆదేశాలున్నాయి. ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నాం. తాత్కాలిక టీచర్, ఆయా నియామకానికి జిల్లా కలెక్టర్ అనుమతి కోసం నివేదించాం. ఈ విద్యా సంవత్సరం నుంచే ప్రీ ప్రైమరీ ఎడ్యుకేషన్ ప్రారంభానికి పకడ్బందీ చర్యలు చేపట్టాం. ఎంపిక చేసిన పాఠశాలల్లో ప్రవేశాల కల్పనపై దృష్టి సారించాం.

-ఎస్.వెంకటేశ్వర్లు, సంగారెడ్డి డీఈవో



ఇందిరా మహిళా శక్తి భవన పనులను పరిశీలిస్తున్న కలెక్టర్

ఇందిరా మహిళాశక్తి భవన పనుల్లో వేగం పెంచండి

మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఇందిరా మహిళాశక్తి భవన నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని గాంధీనగర్‌లో రూ.5 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న భవన నిర్మాణ పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. కాంట్రాక్టర్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. పనులను త్వరితగతి పూర్తిచేసి నవంబరు నాటికి అందుబాటులోకి తీసుకురాలని ఆదేశించారు.

12న బేస్ బాల్ జట్ల ఎంపికలు

వర్గల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 12న సిద్దిపేట జిల్లా సీనియర్ స్త్రీ, పురుషుల బేస్ బాల్ జట్ల ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా బేస్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు నిమ్మ రంగారెడ్డి ఆదివారం తెలిపారు. వర్గల్ మండలం నెంటూర్ విశ్వశాంతి విద్యా నికేతన్ హైస్కూల్‌లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. అభ్యర్థులు ఆధార్ కార్డుతో ఆరోజు ఉదయం 10 గంటలకు హాజరుకావాలని తెలిపారు. పూర్తి వివరాలకు 9848949152, 9391213799, 9989409804 నంబర్ల ద్వారా సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో బేస్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మధు యాదవ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రవీన్‌గౌడ్ తదితరులు ఉన్నారు.



చందాపూర్ గ్రామంలో వరినారు తీస్తున్న ఆంధ్రా కూలీలు

వరి నాటుకు ఆంధ్రా కూలీలు

● ఇక్కడ కూలీల కొరతే కారణం ● ఖర్చు ఆదా

తొగుట, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లాలో వరి నాట్లు వేయడానికి కూలీల కొరత తీవ్రంగా ఉంది. దీంతోపాటు కూలీ రేట్లు కూడా రోజుకు రూ.600 వరకు పెరగడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఆంధ్ర ప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా పల్నాడు ప్రాంతం నుంచి వచ్చిన కూలీలపై రైతులు ఆధారపడుతున్నారు. ఆంధ్రా కూలీలు ఎకరాకు రూ.6000 తీసుకుని నారు తీయడం, నాటు వేయడం వంటి పనులను త్వరగా పూర్తి చేస్తున్నారు. ఇక్కడి కూలీలతో వరి నాటు వేస్తే ఎకరాకు రూ.8 వేల నుంచి రూ.9 వేల వరకు రైతులకు ఖర్చు వస్తుంది. అదే ఆంధ్ర కూలీలతో పని చేయిస్తే రైతులకు ఎకరాకు దాదాపు రూ.2వేల నుంచి 3వేల వరకు ఆదా అవుతోంది. తొగుట, మిరుదొడ్డి, కొండపాక, గజ్వేల్, సిద్దిపేట రూరల్, దౌల్తాబాద్, రాయపోల్, దుబ్బాక వంటి మండలాల్లో రైతులు ఇదే విధానాన్ని అనుసరిస్తున్నారు.



చందాపూర్ గ్రామంలో వరినాటు వేస్తున్న ఆంధ్రా కూలీలు

పని త్వరగా పూర్తవుతుంది..



కూలీల కొరత, అధిక రేట్ల కారణంగానే ఆంధ్రా కూలీలను రప్పించాం. వారివల్ల పని త్వరగా పూర్తవుతువ్వడంతో కొంత ఖర్చు కూడా ఆదా అవుతుంది. గత రెండేళ్లగా బీహారు కూలీలతో నాటు వేయించగా ఈసారీ ఆంధ్రకూలీలతో నాటు వేయిస్తున్నా.

- సిరిసిల్ల భాస్కర్, చందాపూర్



విద్యారత్న పురస్కారాన్ని అందుకుంటున్న ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణ

రామకృష్ణకు జాతీయ స్థాయి పురస్కారం

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం నిజాంపూర్(కె)ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డా.పోట్రు రామకృష్ణకు జాతీయ స్థాయి విద్యారత్న పురస్కారం దక్కింది. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఆదివారం హ్యూమన్ రైట్స్ పబ్లిక్ ప్రొటెక్షన్ సర్వీస్ వారి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వివిధ రంగాల్లో ప్రతిభ కనబర్చిన వారిని ఎంపిక చేసి పురస్కారాలు అందజేశారు. ఇందులో భాగంగా హ్యూమన్ రైట్స్ పబ్లిక్ ప్రొటెక్షన్ సర్వీస్ జాతీయ అధ్యక్షుడు కొంపల్లి సత్యానారాయణ, స్వర్ణగిరి ఆలయ వ్యవస్థాపకుడు మానెపల్లి రామారావు, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు రమేశ్ చేతుల మీదుగా రామకృష్ణ జాతీయ పురస్కారాన్ని అందుకున్నారు. విద్యా, సామాజిక రంగంలో చేసిన విశేష సేవలకు రామకృష్ణకు ఈ పురస్కారం వరించింది. ఈ కార్యక్రమంలో హెచ్ఎం టీవీ జోర్దార్ రాములు, సహాయ నటుడు సమ్మయ్య పాల్గొన్నారు. కాగా విద్యారత్నపురస్కారం అందుకున్న రామకృష్ణను ఎంఈవో శంకర్, కాంప్లెక్స్ హెచ్ఎం రాజశ్రీ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు అభినందించారు.

జాతీయ యోగా పోటీలకు ఎంపిక



ఎంపికైన యోగాసాధకులు, మెడల్స్ సాధించిన క్రీడాకారులు

సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : జాతీయ యోగా పోటీలకు సిద్దిపేట జిల్లా నుంచి ఐదుగురు ఎంపికయ్యారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో సీనియర్ పురుషుల (45 నుంచి 55 ఇయర్స్) విభాగంలో ట్రెడిషనల్ అండ్ బ్యాలెన్స్ అంశాల్లో సిద్దిపేటకు చెందిన సురేష్ యాదవ్, సీనియర్ మహిళా విభాగంలో బ్యాక్ బెండింగ్ అంశంలో టీ. కవితారావు, సంపత్‌కుమార్, సీనియర్-బి మహిళా విభాగంలో ట్విస్టింగ్ అంశంలో జైన సంధ్య, బ్యాక్ బెండింగ్ అంశంలో ఎం.నర్మద అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. అలాగే సీనియర్-ఏ విభాగంలో హ్యాండ్ బ్యాలెన్స్ లో శ్రీప్రసన్న, ఫార్వర్డ్ బెండింగ్‌లో బత్తిని సంధ్య, ట్రెడిషనల్ ఈవెంట్లో మనీషా ఉత్తమ ప్రతిభ కనబరిచి మెడల్స్ సాధించారు. జాతీయ యోగాసనా పోటీలకు ఎంపికైనవారు తెలంగాణ రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ విషయమై సిద్దిపేట జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తోట అశోక్, ప్రధాన కార్యదర్శి నిమ్మ శ్రీనివాస్ రెడ్డి, తెలంగాణ యోగాసనా స్పోర్ట్స్ జాయింట్ సెక్రటరీ, యోగా శిక్షకుడు తోట సతీష్, వ్యాస మహర్షి యోగా సొసైటీ చైర్మన్ డాక్టర్ అరవింద్, యోగా సంఘాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

మైనంపల్లి వ్యవహారం వల్లే కాంగ్రెస్‌కు రాజీనామా

● తల్లి పేరు పెట్టి అసభ్యకరంగా దూషించాడు
● సిద్దిపేటకు హనుమంతరావుకు సంబంధమేమిటి?
● ఫార్మర్స్ ఫస్ట్ ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ నాయకుడు చక్రధర్‌గౌడ్ మండిపాటు



సమావేశంలో మాట్లాడుతున్న చక్రధర్‌గౌడ్

సిద్దిపేట ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట కాంగ్రెస్ పార్టీలో మైనంపల్లి హనుమంతరావు వ్యవహరిస్తున్న శైలి వల్లే కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ఫార్మర్స్ ఫస్ట్ ఫౌండేషన్ చైర్మన్, ఆ పార్టీ నాయకుడు గాదగోని చక్రధర్‌గౌడ్ మండిపడ్డారు. ఆదివారం సిద్దిపేటలోని ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మైనంపల్లి హనుమంతరావుపై విరుచుకుపడ్డారు. ఈ మేరకు ఆదివారం తన రాజీనామాను ఆమోదించాలని కోరుతూ టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌కు లేఖ రాశారు. సిద్దిపేటకు ఎలాంటి సంబంధం లేని మైనంపల్లి సిద్దిపేటలో పెత్తనం చేలాయించాలని చూస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో సిద్దిపేటలో భూకబ్జాలకు పాల్పడిన వారిని పార్టీలోకి తీసుకొని, ల్యాండ్ మాఫియా, రౌడీ షీటర్లకు మద్దతు పలుకుతూ, నిజమైన కాంగ్రెస్ కార్యకర్తల ఆత్మస్థైర్యాన్ని దెబ్బ తీస్తున్నారని మండిపడ్డారు. పార్టీ కోసం కష్టపడుతున్న తనను తల్లి పేరు పెట్టి అసభ్యకరమైన పదజాలంతో పది మందిలో తిట్టడం తనను తీవ్రంగా కలిచి వేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. తనతో తిరిగే కాంగ్రెస్ కార్యకర్తలపై అక్రమ పోలీసు కేసులు, రౌడీ షీట్లు పెడుతూ వేధిస్తున్నాడని ఆరోపించారు. మైనంపల్లిపై కాంగ్రెస్ అధిష్టానం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు. ఇంతకాలం తనను ఆదరించిన సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, సిద్దిపేట కాంగ్రెస్ కార్యకర్తలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మైనం పల్లి హనుమంతరావు వ్యవహార శైలి వల్ల ఉమ్మడి మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీకి తీవ్ర నష్టం జరుగుతుందని తెలిపారు. అధిష్టానం మైనంపల్లిపై చర్యలు తీసుకోకపోతే రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి భంగపాటు తప్పదని హెచ్చరించారు. రాష్ట్రంలో బీసీలకు విద్య, ఉద్యోగాలు, రాజకీయాల్లో, స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ ఇస్తామని చెప్పడం బూటకమేనని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు తిరుపతి, శ్రీకాంత్, అశ్వాక్, శివ, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

రైస్ మిల్లులో చోరీ

● రూ. 4లక్షలు అపహరణ

కొల్చారం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రంగంపేటలోని రైస్ మిల్లులో శనివారం రాత్రి చోరీ జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ముప్పిడి కృష్ణ కు చెందిన రైస్ మిల్లు తాళాన్ని దుండగులు పగులగొట్టి లోనికి ప్రవేశించి కార్యాలయంలోని పెట్టెలో ఉన్న రూ.4లక్షల నగదును దోచుకెళ్లారు. ఆదివారం ఉదయం యజమాని రైస్ మిల్ వద్దకు వెళ్లేసరికి కార్యాలయ తాళం పగలగొట్టి ఉండడంతో పోలీసులకు సమాచారం అందించారు. మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్ రెడ్డి, ఎస్ఐ మొయినుద్దీన్ ఘటనా స్థలానికి వచ్చి వివరాలను సేకరించారు. అలాగే శనివారం రాత్రి రాంపూర్ దుర్గామాత ఆలయ తాళాలు పగులగొట్టి చోరీకి యత్నించగా ఏమి దొరక్క వస్తువులను చిందరవందర చేసి వెళ్లిపోయారు

వైన్స్‌లో రూ.24వేలు..

చిలప్‌చెడ్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని జగ్గంపేట గ్రామంలోని వైన్స్‌లో ఆదివారం చోరీ చోటు చేసుకుంది. పోలీసులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం జగ్గంపేట-సిరిపురం(గేట్) గ్రామ శివారులోని ఎస్‌వీఆర్ వైన్స్‌లో తెల్లవారు జామున 3 గంటల సమయంలో గుర్తు తెలియని దుండగుడు ద్విచక్ర వాహనం పై వచ్చి వైన్స్ షెటర్‌ను గడ్డపార సహాయంతో పైకి లేపి లోపలికి ప్రవేశించాడు. ముఖానికి మాస్క్, చేతులకు గ్లౌజులు, తలకు హెల్మెట్ పెట్టుకుని వచ్చిన అతడు, సీసీ టీవీ వైరును తొలగించి లోపలికి ప్రవేశించినట్లు ఫుటేజీలో రికార్డు అయ్యింది. గల్లా పెట్టెలోని రూ.24 వేల నగదును అపహరించాడని వైన్స్ నిర్వాహకుడు రమేష్ తెలిపాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నర్సింహులు పేర్కొన్నారు.

'నులి'పేస్తేనే ఆరోగ్యం

● నేడు 1-19 వయస్సుగలవారికి నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ
● ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



కొండపాక, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): పిల్లల ఆరోగ్యవంతమైన భవిష్యత్తు కోసం ప్రభుత్వం పలు కార్యక్రమాలు నిర్వహిస్తోంది. అందులో భాగంగా, సోమవారం నుంచి 'జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం'ను పురస్కరించుకుని డివార్మింగ్ కార్యక్రమాలు నిర్వహించనున్నది. ఈ సందర్భంగా 1 నుంచి 19 సంవత్సరాల వయసుగల వారికి ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయనున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో ఈ మాత్రలు అందుబాటులోఉంటాయి. సోమవారం తీసుకోని వారికి ఆగస్టు 18న తిరిగి మాత్రలు అందిస్తారు.

వయసును బట్టి డోస్

1 నుంచి 2 సంవత్సరాల పిల్లలకు 400 ఎంజీలో సగం అంటే 200 ఎంజీ మాత్రను, మిగతా వారికి 400 ఎంజీ పూర్తి మాత్రను ఇవ్వాలి. మాత్రను బాగా నమిలి మింగాలి. అల్పాహారం లేదా భోజనం తర్వాతే ఈ మాత్రలను తీసుకోవాలని వైద్యులు సూచించారు. ఖాళీ కడుపుతో ఉన్నవారికి ఎట్టి పరిస్థితిల్లో ఇవ్వరాదని తెలిపారు.

నులిపురుగుల వ్యాప్తి ఇలా..

పరిసరాల అపరిశుభ్రత, చేతులను శుభ్రం చేసుకోకపోవడం, బహిరంగ మలవిసర్జన, శుభ్రం చేయని నీరు తాగడం వల్ల నులిపురుగులు వ్యాపిస్తాయి. వీటి వల్ల పిల్లల్లో రక్తహీనత, పోషకాహార లోపం, ఆకలి లేకపోవడం, కడుపునొప్పి, విరోచనాలు వంటి సమస్యలు వస్తాయి. నులిపురుగుల నిర్మూలన వల్ల రక్తహీనత తగ్గి, పోషకాల శోషణ మెరుగుపడుతుంది. తల్లిదండ్రులు దీన్ని గమనించి పిల్లలకు మాత్రలు ఇప్పించాలి.

బోధకాలు నిర్మూలనే లక్ష్యం

● సంగారెడ్డి జిల్లా వైద్యాధికారి నాగనిర్మల

అమీన్‌పూర్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): బోధకాలు, నులిపురుగుల నివారణకు ఇంటింటికీ మందుల పంపిణీ చేస్తున్నట్లు జిల్లా వైద్యాధికారి డాక్టర్ నాగనిర్మల పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఆనంద్‌నగర్‌లో మందుల పంపిణీ శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. 1నుంచి 19సంవత్సరాల పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలను వైద్యారోగ్య సిబ్బంది పంపిణీ చేస్తారన్నారు. వ్యాధుల నుంచి పిల్లలను కాపాడుకునేందుకు సమష్టిగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నందారంన ర్సింహగౌడ్, మాజీ కౌన్సిలర్లు బాశెట్టికృష్ణ, యూనుస్, ప్రోగ్రాం అధికారి డాక్టర్ ప్రవీన్, భానూర్ పీహెచ్‌సీ మెడికల్ అధికారి డాక్టర్ దీప్తి, వెద్యాధికారి డాక్టర్ జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆనంద్‌నగర్ కాలనీలో బోధకాలు, నులిపురుగుల మాత్రల పంపిణీ ప్రారంభిస్తున్న వైద్యాధికారులు

ఆర్టీసీ ప్రత్యేక బాదుడు


● టికెట్‌పై 50 శాతం అదనంగా వసూలు

జహీరాబాద్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): పండుగలు, పెళ్లిలు, తదితర సీజన్‌లొస్తే చాలు ఆర్టీసీ ప్రయాణికులపై అదనపు భారం మోపుతూనే ఉన్నది. ప్రత్యేక బస్సుల పేరిట ఒక్కో టికెట్‌పై 50% అదనంగా వసూలు చేస్తున్నారు. ప్రస్తుతం జహీరాబాద్ డిపో మీదుగా హైదరాబాద్, లింగంపల్లి, బీదర్ రూట్లలో 12 అదనపు ట్రిప్పులను నడుపుతున్నారు. సాధారణంగా బీదర్-హైదరాబాద్‌కు టికెట్ ధర రూ.220 ఉండగా, సీజన్‌లలో రూ.320 వసూలు చేస్తున్నారు. ఇక జహీరాబాద్-హైదరాబాద్ రూ.180కి గాను రూ.300, జహీరాబాద్-బీదర్ రూ.60కి గాను రూ.90, జహీరాబాద్-సంగారెడ్డి రూ.100కు గాను రూ.150, బీదర్‌నుంచి లింగంపల్లి వరకు రూ. 190-250, జహీరాబాబాద్-సదాశివపేట రూ.90కి గాను రూ.120 ప్రయాణికుల నుంచి వసూలు చేస్తున్నారు. ఇక్కడే కాకుండా ఉమ్మడి మెదక్‌జిల్లా వ్యాప్తంగా ఆర్టీసీ అధికారులు ప్రత్యేకం పేరిట వసూలు చేస్తున్నారని ప్రయాణికులు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు.



సదాశివపేట నుంచి జహీరాబాద్ వరకు రూ.120 టికెట్

భక్తజనసంద్రం



వర్గల్ : నాచగిరి క్షేత్రంలో మూలవిరాట్ లక్ష్మీనృసింహస్వామి



వర్గల్ : నాచగిరి క్షేత్రంలో భక్తులు



కొమురవెల్లి : మల్లన్న నిత్య కల్యాణంలో భక్తులు

కొమురవెల్లి/ఝరాసంగం/వర్గల్/ పాపన్నపేట, ఆగస్టు10 (ఆంధ్రజ్యోతి):శ్రావణమాసం ఆదివారం సందర్భంగా కొమురవెల్లి మల్లికార్జునస్వామి సన్నిధిలో భక్తులు కోలాహలం కనిపించింది. గంగిరేణి చెట్టు వద్ద, ఆలయ ముఖ మండపంలో పట్నాలు వేసి బోనాలు చెల్లించారు. ముఖ మండపంలో స్వామివారి నిత్య కల్యాణంలో పాల్గొన్నారు. కేతకీ సంగమేశ్వర స్వామి ఆలయం భక్తులతో కిక్కిరిసింది. అమృతగుండంలో స్నానాలు ఆచరించి స్వామి దర్శనం కోసం క్యూలో బారులు తీరారు. స్వామి దర్శనం కోసం భక్తులకు రెండు గంటల సమయం పట్టింది. నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో సామూహిక సత్యనారయణ స్వామి వ్రతాలు, నిజాభిషేకాలు, నిత్యకల్యాణాలు నిర్వహించారు. ఏడుపాయల వనదుర్గామాత ఆలయం భక్తుల రద్దీతో కిటకిటలాడింది.బోనాలు, ఒడిబియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పోలీసులు బందోబస్తు చేపట్టారు.



పాపన్నపేట: మూలవిరాట్ వనదుర్గామాత



పాపన్నపేట : అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



ఝరాసంగం : కేతకీ సంగమేశ్వర స్వామి ఆలయంలో

న్యూస్ బాక్స్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొండాపూర్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : సదాశివపేట విద్యుత్ డివిజన్ కేంద్రంలో అత్యవసర మరమ్మతుల కారణంగా నేడు కొండాపూర్ మండలంలోని 24 గ్రామ పంచాయతీలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని మండల విద్యుత్ శాఖ ఏఈ సిద్దిరాజ్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 1:30 నుంచి సాయంత్రం 5:30 వరకు మండలంలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

మునిపల్లిలో..

మునిపల్లి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : మునిపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ బాలకృష్ణ ఆదివారం ప్రకటనలో తెలిపారు. సదాశివపేట 132కేవీఏ సంబంధించి మరమ్మతుల కారణంగా ఉదయం 10 నుంచి 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

కల్హేర్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని అలీఖాన్‌పల్లి గ్రామానికి చెందిన విశ్వనాథ్ బుజ్జియానికి మంజూరైన రూ.13,500 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోపాల్‌రెడ్డి, నారాయణ, రాములు, గణపతి, శోభన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఘటం ఊరేగింపు

రామచంద్రాపురం టౌన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : రామచంద్రాపురం డివిజన్ పరిధి సోమేశ్వరస్వామి ఆలయం నుంచి శ్రీనివాస్‌నగర్ ఐదుగుళ్ల పోచమ్మ ఆలయం వరకు ఆదివారం ఘటం ఊరేగింపు నిర్వహించారు. మేళతాళాలతో గ్రామస్తులు పెద్దఎత్తున ఊరేగింపులో పాల్గొన్నారు. కార్పొరేటర్ పుష్పానగేష్ ఊరేగింపులో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

ఉచిత శిక్షణకు నేడే ఆఖరు

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని బీసీ స్టడీ సర్కిల్‌లో గ్రూప్-1, 2, 3,4తో పాటు ఆర్‌ఆర్‌బీ, బ్యాంకింగ్ ఫౌండేషన్ పరీక్షలకు ఉచిత శిక్షణ పొందేందుకు నేడు దరఖాస్తుల స్వీకరణ ఆఖరు అని స్టడీ సర్కిల్ డైరెక్టర్ ప్రవీణ్ ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ ఉత్తీర్ణులైన సంగారెడ్డి, మెదక్ జిల్లాలకు చెందిన అభ్యర్థులు సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపికైన వారికి ఈ నెల 25 నుంచి 150 రోజుల పాటు శిక్షణతో పాటు నెలకు వెయ్యి చొప్పున స్టైపెండ్ ఇస్తామని తెలిపారు. వివరాలకు 08455-277015 నంబరు సంప్రదించాలని ఆయన కోరారు.

ఫసల్‌వాదిలో సీపీఎం పర్యటన

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి మండలం ఫసల్‌వాది గ్రామంలో సీపీఎం బృందం ఆదివారం సందర్శించి గ్రామస్తులను ఆలీని సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీపీఎం ఏరియా కార్యదర్శి యాదగిరి మాట్లాడుతూ గ్రామంలోని దళితవాడల్లో ప్రజలు సమస్యలతో సాహవాసం చేస్తున్నారని, సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యం వహిస్తున్న పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఇందులో సీపీఎం మండల కమిటీ సభ్యుడు శ్రీనివాస్, నాయకులు పాపని ఉన్నారు.

రోడ్డును పునరుద్ధరించండి

జహీరాబాద్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : జహీరాబాద్ పట్టణంలోని జహీరాబాద్-షిస్టాపూర్ గ్రామాల మధ్యలో గల రోడ్డు పూర్తిగా కుదించుకుపోయింది. గతంలో బైపాస్ రోడ్డు లేకపోవడంతో ఈ రోడ్డు గుండానే ప్రయాణికులు రాకపోకలు సాగించేవారు. ఈ రెండు గ్రామాల మధ్య ఉన్న రోడ్డు పైనుంచి బైపాస్ రోడ్డు వెళ్లడంతో రోడ్డు ఆధ్వాన్నమైంది. అధికారులు స్పందించి రోడ్డును పునరుద్ధరించాలని కోరుతున్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

నర్సాపూర్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : నర్సాపూర్ సమీపంలోని బీవీఆర్ఐటీలో బీటెక్ ఇంజనీరింగ్ నాలుగేళ్లు పూర్తి చేసుకున్న విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. అమెరికాలోని పర్డ్యూ ప్రధాన కార్యాలయంలో ఉన్న ఆపిల్ టెక్ కమ్యూనికేషన్ కంపెనీ ప్రతినిధి పద్మజాశ్రీరాం హాజరై విద్యార్థులకు పట్టాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీవీఆర్ఐటీ డైరెక్టర్ ఆదిత్య ప్రిన్సిపాల్ సంజయ్‌దూబె, డైరెక్టర్ లక్ష్మీప్రసాద్ పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని గేదె మృతి

శివ్వంపేట, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : గుర్తుతెలియని వాహనం ఢీకొని గేదె మృతి చెందిన సంఘటన సంగారెడ్డి తూప్రాన్ జాతీయ రహదారి శివ్వంపేట పోలీస్‌స్టేషన్ సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. మండల కేంద్రమైన శివ్వంపేటకు చెందిన మెతుకు బాలేష్ గేదెను పోలీస్‌స్టేషన్ అతి సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందింది. మృతిచెందిన గేదె విలువ రూ.లక్ష ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు బాలేష్ కుటుంబం వేడుకుంటోంది.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా రైతువేదికలు

- సమావేశాలు నిర్వహించని అధికారులు
- అయోమయంలో అన్నదాతలు

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : అన్నదాతల కోసం నిర్మించిన రైతువేదిక భవనాలు నిరుపయోగంగా మారి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మారాయి. రైతువేదికల్లో రైతులకు పంటల సాగులో ఏలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, భూసార పరీక్షలు చేయిస్తే ఎలాంటి ప్రయోజనాలు కలుగుతాయి, ఎలాంటి విత్తనాలు, ఎరువులు వాడాలనే విషయాలతో పాటు అన్నదాతలు వేసే పంటల సాగులో మెళకువలు, తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి ఎలా సాధించాలనే విషయాలపై రైతులకు వ్యవసాయ శాఖాధికారులు సలహాలు, సూచనలు అందించేందుకు ఒక్కో రైతువేదికకు రూ.25 లక్షలు వెచ్చించి నిర్మించారు. దీంతో మండల వ్యవసాయ అధికారులు ప్రతిరోజూ అక్కడే నుంచి విధులు నిర్వర్తించేవారు. నిధుల లేమితో నిర్వహణ సరిగ్గా లేక రైతువేదిక భవనాలు మందుబాబులకు అడ్డాగా మారాయి. రైతువేదిక ప్రాంతాలు మద్యం సీసాలతో నిండిపోతున్నాయి.

నిధుల లేమి..

రైతువేదికల నిర్వహణకు తాగునీరు, విద్యుత్ బిల్లు, స్టేషనరీ, పారిశుధ్య నిర్వహణ తదితర అవసరాల నిమిత్తం గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నెలకు రూ.9 వేలు మంజూరు చేసేది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నిధులు రావడం లేదని వ్యవసాయ అధికారులు తెలిపారు. నిధులు నిలిపివేయడంతో కొంతకాలం స్థానిక వ్యవసాయ శాఖాధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో రైతువేదికలను వినియోగించారని, అది తలకు మించి భారంగా మారిందని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతువేదికల నిర్వహణకు నిధులు మంజూరు చేయాలని పలువురు రైతులు కోరుతున్నారు.



కల్పగూర్ గ్రామ పరిధిలోని అంగడిపేటలో నిరుపయోగంగా రైతువేదిక



రైతువేదిక భవనం ఆవరణలో తాగి పారేసిన బీరు, మందు బాటిళ్లు

నిధులు రావడం లేదు

రైతువేదికల నిర్వహణకు మూడేళ్లుగా నిధులు రావడం లేదు. తామే సొంత ఖర్చులతో నిర్వహణ చూసుకుంటూ మనిషిని పెట్టి శుభ్రం చేయిస్తున్నాం. సాయంత్రం సమయంలో రైతువేదిక వద్ద మద్యం సేవించడం వాస్తవమే. సీసీ కెమెరాలు కూడా ధ్వంసం చేశారు. ఉన్నతాధికారులకు నిధులు మంజూరు చేసేలా చూడాలని కోరాం.

- శ్రావణ్, ఏఈవో, సంగారెడ్డి

రబ్బర్ డ్యాం ఏర్పాటుకు సమగ్ర ప్రణాళిక : ఎమ్మెల్యే

నారాయణఖేడ్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : మంజీరా నదిపై మనూరు మండల పరిధిలోని రాయిపల్లి వద్ద రబ్బర్ డ్యాం ఏర్పాటు కోసం వీలైనంత త్వరగా సమగ్ర ప్రణాళిక(డీపీఆర్) రూపొందించి అందజేయాలని కన్సల్టెన్సీ నిర్వాహకులకు ఎమ్మెల్యే సంజీవరెడ్డి సూచించారు. నీటి పారుదల శాఖ విశ్రాంత సీఈ వీరరెడ్డి, హైడ్రో కన్‌స్ట్రక్ట్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీధర్‌రెడ్డి, ప్రాజెక్టు సమన్వయకర్త ప్రకాష్‌రెడ్డి ఆదివారం రాయిపల్లి వద్ద మంజీరా నది పరీవాహక ప్రాంతాన్ని మరోమారు పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యేను క్యాంపు కార్యాలయంలో కలిసి రబ్బర్ డ్యాం గురించి వివరాలను తెలిపారు. మంజీరా నదిపై రాయిపల్లి వద్ద గల వంతెనను ఆధారంగా చేసుకుని 320 మీటర్ల మేర రబ్బర్ డ్యాంగా ఏర్పాటు చేయాలని, దీనికి రూ.200 కోట్లు ఖర్చవుతుందని ప్రాథమిక అంచనా అని అన్నారు. బుల్లెట్‌ప్రూఫ్‌గా ఉండి ఎంత వరదైనా తట్టుకుంటుందని చెప్పారు. 50 ఏళ్ల వరకు జీవిత కాలం ఉండగా.. నిర్వహణ ఖర్చు నిర్మాణ వ్యయంలో ఒకశాతం మాత్రమే ఉంటుందన్నారు. ఐదుమీటర్ల ఎత్తు వరకు నీటిని నిల్వ చేసుకోవచ్చన్నారు. దీంతో ఎగువనుంచి వచ్చే 12 టీఎంసీల వరకు నీటిని నిల్వ ఉంచొచ్చన్నారు. ఈ నీటి నిల్వతో నారాయణఖేడ్, ఆందోల్, జహీరాబాద్ ప్రాంతాల్లో భూగర్భజలాలు పెరిగి వేసవి కాలంలోనూ బోర్లు పనిచేసే అవకాశాలు ఉంటాయన్నారు. త్వరలోనే డీపీఆర్‌ను రూపొందించి అందజేస్తామని కన్సల్టెన్సీ నిర్వాహకులు, ఎమ్మెల్యేకు వివరించారు.



ఎమ్మెల్యే సంజీవరెడ్డికి రబ్బర్ డ్యాం వివరాలను తెలుపుతున్న కన్సల్టెన్సీ నిర్వాహకులు

నులిపురుగుల నివారణే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి



నులిపురుగుల నివారణ మందులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : నులిపురుగుల నివారణే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం పటాన్‌చెరు ఏరియా ఆసుపత్రిలో జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం ప్రారంభించి మాట్లాడారు. బాలబాలికల్లో నులిపురుగుల సమస్యలు పెరుగుతున్నాయని వివరించారు. 1-19 సంవత్సరాల వయస్సు ఉన్న చిన్నారులకు ఉచితంగా మందులు అందజేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి నాగనిర్మల, మనోహర్, విజయ్‌కుమార్, శంకర శ్రీను పాల్గొన్నారు.

వీధిదీపాలు లేవు... ప్రకటనల స్తంభాలా..?

రామచంద్రాపురం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : శేరిలింగంపల్లి మండలం నుంచి కొల్లూరులోని ఔటర్ రింగ్‌రోడ్డు (ఓఆర్ఆర్)ను అనుసంధానం చేస్తూ పదేళ్ల క్రితం రేడియల్ రోడ్డు 30 ఎక్స్‌టెన్షన్ పనులు ప్రారంభించారు. ఇప్పటికీ రోడ్డు పనులు పూర్తికాలేదు. పనులు పూర్తి చేయాలని స్థానిక సంక్షేమ సంఘం(టిఐ) పలుమార్లు ప్రజాప్రతినిధులు, మంత్రులకు విన్నవించారు. ఇదిలా.. అని బుట్టదాఖలు అవుతున్నాయి. వీధి దీపాలు లేకున్నా.. ప్రకటన దిమ్మెలు ఏర్పాటు చేయకపోవడం, రేడియల్ రోడ్డు పూర్తికాక రాత్రిళ్లు అనేక ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని అధికారులు.. ఆదాయం కోసం ప్రకటనల దిమ్మెలకు అనుమతులు ఇస్తున్నారు. మున్సిపాలిటీ ఇచ్చిన అనుమతులను ఆరేండ్లుగా ఆర్‌అండ్‌బీ జారీ చేస్తున్నట్లు ఓ అధికారి తెలిపారు. రోడ్డు మధ్యలోని డివైడర్‌లో చేస్తున్న ఈ పనుల కారణంగా తరుచూ చేపట్టాల్సిన స్టేషనరీ పనులు, భగీరథ పనులకు ఆటంకం కలిగే ప్రమాదం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు పనులు పూర్తి అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



రోడ్డుపై ఏర్పాటు చేస్తున్న ప్రకటనల స్తంభాలు

ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి



ఫైలేరియా మందులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ అంజిరెడ్డి

రామచంద్రాపురం టౌన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్సీ అంజిరెడ్డి అన్నారు. ఆదివారం రామచంద్రాపురం సాయినగర్ కాలనీలో జాతీయ ఫైలేరియా నులిపురుగుల నివారణ దినోత్సవం నిర్వహించారు. స్థానికులకు ఫైలేరియా మందులు అందజేసి మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వినియోగించుకోవాలని కోరారు. క్షేత్రస్థాయిలో ఆరోగ్య పరిస్థితులు సక్రమంగా ఉన్నాయా లేదా అనేదానిపై పరిశీలించిన తరువాత ఇంటింటికి ఫైలేరియా నిర్మూలన మందులు పంపిణీ చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి నాగనిర్మల, డిప్యూటీ జిల్లా వైద్యాధికారి సునంద, జిల్లా మలేరియా అధికారి మల్లేష్, రామచంద్రాపురం వైద్యాధికారి శేఖర్, మనోహర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి తదితరులు పాల్గొన్నారు.

కల్లుగీత సొసైటీలకు భూములు కేటాయించాలి

- సంఘం జిల్లా అధ్యక్షుడు ఆశన్నగౌడ్

కల్హేర్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రతీ కల్లుగీత సొసైటీకు ఈత, తాటి చెట్టు పెంచుకోవడానికి భూమిని కేటాయించాలని, కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చాలని కల్లుగీత కార్మిక సంఘం సంగారెడ్డి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆశన్నగౌడ్, రమేష్‌గౌడ్ డిమాండ్ చేశారు. కల్హేర్ మండల పరిధిలోని మార్డి గ్రామంలో ఆదివారంఏర్పాటు చేసిన గీతన్నల సామాజిక చైతన్యయాత్ర సభలో వారు పాల్గొని మాట్లాడారు. 560 జీవో ప్రకారం ఐదు ఎకరాల భూమి కేటాయించాలని ప్రభుత్వ ఉత్తర్వులు ఉన్నా.. ఎక్కడా అమలు జరగడం లేదన్నారు. కొండాపూర్ మండలంలో వందల ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నా కల్లుగీత సొసైటీలకు కేటాయించకుండా బడా పారిశ్రామికవేత్తలకు, ప్రైవేటు కంపెనీలకు కేటాయిస్తున్నారని వారు విమర్శించారు. గీత కార్మికులకు రూ.4 వేల పింఛన్, ఈత, తాటి చెట్ల పైనుంచి గీత కార్మికుడు పడి మరణిస్తే రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించి, ట్యాంక్‌బండ్‌పై సర్దార్ పాపన్నగౌడ్ విగ్రహం ఏర్పాటు చేసి హామీలను నిలబెట్టుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జంగన్నగౌడ్, ఉపాధ్యక్షుడు అంజాగౌడ్, కార్యదర్శి ప్రసాద్ గౌడ్, కల్హేర్ గీత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు నాగాగౌడ్, నాయకులు పాల్గొన్నారు.



మార్డి గ్రామంలో గీతన్నల సామాజిక చైతన్యయాత్రలో కార్మికులు

ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులు : డీఎం

నారాయణఖేడ్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ఇబ్బందులు కలుగకుండా నారాయణఖేడ్ నుంచి 10 ప్రత్యేక బస్సులను నడిపినట్లు ఆర్టీసీ డీఎం మల్లేశయ్య తెలిపారు. ఆదివారం ఖేడ్ పట్టణంలోని రాజీవ్ చౌక్ సమీపంలో బస్టాప్ వద్ద ఆర్టీసీ పర్యవేక్షణ కమిటీ ప్రతినిధి, బస్సుల రాకపోకలను పర్యవేక్షించారు. ప్రయాణికులతో మాట్లాడి ఆర్టీసీ పరంగా అందిస్తున్న సేవలను తెలుసుకున్నారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు రద్దీతో ప్రయాణికులకు ఇబ్బందులు కలుగకుండా చూశామన్నారు. ఆయన వెంట అసిస్టెంట్ డీఎం నర్సింహులు, మార్కెటింగ్ సేల్ ఇన్‌చార్జి పాండు, కంట్రోలర్ రాములు, తదితరులు ఉన్నారు.

బీసీల పట్ల కేంద్రం నిర్లక్ష్యం



సంగారెడ్డి పాతబస్టాండ్ వద్ద ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

సంగారెడ్డి రూరల్/పటాన్‌చెరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : బీసీల పట్ల కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తున్నదని సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్ విమర్శించారు. బీసీ రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సంగారెడ్డి పాతబస్టాండ్ వద్ద సీపీఎం నాయకులు ఆదివారం ప్లకార్డులతో నిరసన తెలిపి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్లను 42 శాతం చట్టం చేసి వెంటనే అమలు చేయాలని, 9వ షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి ఆమోదం కోసం పంపించిందని, కానీ కేంద్ర ప్రభుత్వం మాత్రం బీసీలను మోసం చేస్తూ 42 శాతం పార్లమెంట్‌లో చట్టం చేయకుండా మతం రంగు పులుముతుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సాయిలు, నర్సింలు, నాయకులు పాల్గొన్నారు. పటాన్‌చెరులో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు రాజయ్య నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో వాజిద్‌అలీ, నాగేశ్వరరావు, అర్జున్, సురేష్, శ్రీధర్, పెంటయ్య, నాగులు, బాషా, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రికుంటలో నల్లపోచమ్మ ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన

జిన్నారం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : గడ్డపోతారం మున్సిపాలిటీ మంత్రికుంటలో నిర్మించిన నల్లపోచమ్మ ఆలయ ఉత్సవాలు, విగ్రహ ప్రతిష్ఠాపన ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఇందులో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి పాల్గొని పూజలు చేశారు. ఆలయ మాజీ జడ్పీటీసీలు బాలిరెడ్డి, దేవానందం, నాయకులు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి, వెంకటేశంగౌడ్, ప్రకాశంచారి, సురేందర్‌గౌడ్, రాజేష్, బాశెట్టి రాజు, అంజనేయులు, జనార్దన్, శ్రీనివాస్‌రెడ్డి, వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా నల్లపోచమ్మ జాతర

చేగుంట, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): చేగుంట మండల కేంద్రంలో మాదిగ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నల్లపోచమ్మ అమ్మవారికి బోనాల ఊరేగింపు నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మాజీ ఎంపీపీ మాసుల శ్రీనివాస్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు అయిత పరంజ్యోతి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో. దప్పు చంద్రయ్య, బక్క చిన్న నరసింహులు, ఎర్ర నాగులు, కుర్మ ఆగమయ్య పాల్గొన్నారు.

ఘనంగా మహంకాళి జాతర

మాసాయిపేట, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన మాసాయిపేటలో ఆదివారం మూడురోజుల పాటు జరిగే మహంకాళి అమ్మవారి జాతర ఘనంగా ప్రారంభమైంది. మొదటిరోజున గ్రామంలోని మహిళలు బోనాలను నెత్తిన పెట్టుకుని డప్పుచప్పుళ్ల మధ్య అమ్మవారికి సమర్పించారు. ఈ జాతరకు సుమారు 30 గ్రామాల నుంచి ప్రజలు, భక్తులు తరలిరానున్నారు.



చేగుంటలో నల్లపోచమ్మ బోనాల ఊరేగింపు

ఘనంగా నల్లపోచమ్మ ఉత్సవాలు

పటాన్‌చెరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : పటాన్‌చెరు డివిజన్ పరిధి బండ్లగూడ మార్క్స్‌నగర్ కాలనీలో నల్లపోచమ్మ ఆలయంలో ఆదివారం బోనాలు వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం మహిళలు బోనాలు ఎత్తుకొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే సోదరుడు గూడెం మధుసూదన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ యాదగిరియాదవ్, నాగరాజ్ యాదవ్ తదితరులు ఉన్నారు.

వైభవంగా ఐదుగుళ్ల పోచమ్మ బోనాలు

రామచంద్రాపురం టౌన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : భారతీనగర్ డివిజన్ పరిధి శ్రీనివాస్‌నగర్ ఐదుగుళ్ల పోచమ్మ బోనాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు జరిపారు. ఇందులో ఎమ్మెల్సీ అంజిరెడ్డి, కార్పొరేటర్ పుష్పానగేష్, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి, మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, భారతీనగర్ కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ అంజయ్యయాదవ్ అమ్మవారిని దర్శించుకున్నారు.

చెరువులకు జలకళ

(5వ పేజీ తరువాయి)

వానలకు బోర్లు రీచార్జ్ అవుతున్నాయి. ముఖ్యంగా పంటల సాగుకు అవకాశాలు మెరుగయ్యాయని జిల్లా వ్యవసాయ అధికారి దేవ్‌కుమార్ తెలిపారు. వరి, మొక్కజొన్న, సువ్వలు, పప్పు ధాన్యాల వంటి పంటల సాగుకు అల్లాదుర్గం, రేగోడ్, పెద్దశంకరంపేట, టేక్మాల్ తదితర మండలాల రైతులు సన్నద్ధం అవుతున్నారు. సమయానికి వర్షాలు పడడం, చెరువులు నిండడంతో సాగునీటి కష్టాలు తీరనున్నాయని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఘనపురం ప్రాజెక్ట్ నుంచి ప్రస్తుతం 21 చెరువులకు నీరు సరఫరా చేస్తున్నామన్నారు.

పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

- కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి

కొల్చారం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి అన్నారు. ఆదివారం కొల్చారం మండల పరిధిలోని పలు గ్రామాల్లో కార్యకర్తలను కలిశారు. గ్రామ అధ్యక్షుడు అశోక్, సీనియర్ నాయకుడు లక్ష్మీపతి పరామర్శించారు. అనంతరం తుక్కాపూర్ మాజీ సర్పంచ్ మాధవి శ్రీశైలం వంశీకు పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఇటీవల క్రితం పెబ్బేర్ బంక్ వద్ద జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ అంసాన్‌పల్లి గ్రామానికి చెందిన మహేష్‌కు సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మల్లేశంగౌడ్, సుధీర్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డితో పాటు మండల నాయకులు పాల్గొన్నారు.

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోండి

సంగారెడ్డి టౌన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని రైతులు రైతుబీమా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి కె.శివప్రసాద్ ఒక ప్రకటనలో కోరారు. రైతుబీమా రైతు కుటుంబానికి ఎంతో ధీమాగా ఉంటుందన్నారు. వ్యవసాయమే జీవనోపాధిగా ఉన్న రైతు కుటుంబంలో రైతు మరణిస్తే వారి కుటుంబసభ్యులు ఆర్థిక సమస్యల్లో చిక్కుకోకుండా ఉండటానికి ప్రభుత్వం రైతుబీమా పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తుందని తెలిపారు. ఇప్పటివరకు ఈ పథకంలో తన పేరు నమోదు చేసుకోని రైతులు ఈ సంవత్సరం అమల్లోకి రైతుబీమా పథకంలో నమోదు చేసుకోవాలని కోరారు. ఈనెల 13వ తేదీలోగా రైతువేదికల్లో వ్యవసాయ విస్తరణ అధికారిని కలిసి దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

విద్యారంగంలో అసమానతలకు సర్కారు విధానాలే కారణం : టీఎస్‌వీ

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : విద్యారంగంలో అసమానతలు, విద్య ప్రైవేటీకరణకు సర్కారు విధానాలే కారణమని స్టూడెంట్స్ వాయిస్(టీఎస్‌వీ) రాష్ట్ర అధ్యక్షుడు బంగారు కృష్ణ అన్నారు. సంగారెడ్డిలోని తెలంగాణ భవన్‌లో తెలంగాణ స్టూడెంట్స్ వాయిస్ విద్యార్థి సంఘం లోగోను ఆదివారం ఆవిష్కరించి మాట్లాడారు. 18న సంగారెడ్డిలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి సందర్భంగా ఆవిర్భావ సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చింతల సాయికుమార్, కార్యదర్శి శ్రీకాంత్, కమల్‌పాషా, రవి, ప్రకాశ్, రాజేశ్ పాల్గొన్నారు.

30 ఏళ్ల అపూర్వ కలయిక



సంగారెడ్డి మండలం కులబ్‌గూర్ సమీపంలోని సరస్వతి శిశుమందిర్‌లో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి మండలం కులబ్‌గూర్ గ్రామ సమీపంలోని శ్రీసరస్వతి శిశుమందిర్ పాఠశాలలో 1994-95 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు 30 ఏళ్ల తర్వాత కలుసుకున్నారు. దేశ, విదేశాల్లో స్థిరపడిన విద్యార్థులు ఆదివారం పాఠశాలలో కలుసుకుని బాల్యం నాటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. అనంతరం పూర్వ ఆచార్యులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ సభ్యుడు, విభాగ్ అకాడమిక్ ఇన్‌చార్జి వెంకటేశంరెడ్డి, ప్రధానాచార్యులు నర్సింహాగౌడ్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

అల్లాపూర్‌లో కొత్త పీర్ల పండుగ

తూప్రాన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): తూప్రాన్ పట్టణ పరిధి అల్లాపూర్‌లో ఆదివారం కొత్త పీర్ల పండుగ జరుపుకున్నారు. మొహర్రం పీర్ల పండుగ ముగిసిన తరువాత అల్లాపూర్ ప్రజలు ఓ దినం నిర్వహించి గ్రామస్తులందరు మూకుమ్మడిగా కొత్త పీర్ల పండుగను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుంది. 15 రోజుల క్రితం కొత్త పీరిని నిలబెట్టారు. ఆదివారం ఉదయమే కొత్త పీరిని లేపి ఊరేగింపు నిర్వహించారు. బక్క సంతోష్‌గౌడ్ ఆధ్వర్యంలో ఉత్సవాలు చేపట్టారు.

వర్షానికి రోడ్లపై నిలిచిన నీరు

నారాయణఖేడ్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : ఖేడ్ ప్రాంతంలో శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు ఎడతెరిపి లేకుండా మోస్తారు వర్షం కురిసింది. ఏడు గంటల పాటు ఏకధాటిగా వర్షం కురియడంతో వరదనీరు నిలిచి ఖేడ్ పట్టణంలోని రోడ్లు జలమయమయ్యాయి. రోడ్లపై నీటితో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతుండటంతో స్థానిక మున్సిపల్ అధికారులు ఎక్స్‌కవేటర్‌తో నిలిచిన నీటిని మురుగు కాలువల్లోకి మళ్లింపజేశారు. ఈ కార్యక్రమాలను మున్సిపల్ శానిటేషన్ అధికారి శ్రీనివాస్ పర్యవేక్షించారు.

గ్రంథాలయానికి వెళ్లేదెలా..



వర్షం నీటితో పూర్తిగా నిండిన గ్రంథాలయ పరిసరాలు

రురసంగం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : రెండు, మూడురోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు మండల కేంద్రమైన రురసంగంలోని గ్రంథాలయం పరిసరాలు పూర్తిగా వర్షం నీటితో నిండుకున్నాయి. దీంతో గ్రంథాలయానికి వచ్చిన పాఠకులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రంథాలయం ముందు ఎప్పటికీ బురదమయంగా ఉంటుందన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ తీసుకుని గ్రంథాలయ పరిసరాలు బాగు చేయించాలని పాఠకులు కోరుతున్నారు.

నర్సాపూర్ అభివృద్ధికి నిధులు తేవాలి : బీఆర్‌ఎస్

నర్సాపూర్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : అధికారంలో ఉన్నామని గొప్పలు చెప్పుకుంటూ ఊరికే తిరగడం కాదని, మీకు చిత్తశుద్ధి ఉంటే నర్సాపూర్ పట్టణ అభివృద్ధికి గత ప్రభుత్వంలో మంజూరై రద్దు చేసిన రూ.40 కోట్లను తిరిగి తీసుకురావాలని బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్ నాయకులకు సవాల్ విసిరారు. ఆదివారం పట్టణంలోని 6,7,9 వార్డుల్లో మూడురోజులుగా కురిసిన వర్షానికి కొన్ని ఇళ్లలోకి నీరు రాగా వాటిని పరిశీలించి, మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు ఊరికే తిరుగుతూ.. అది చేశాం. ఇది చేశామని చెప్పుకోవడం కాదని, నర్సాపూర్ పట్టణంలో అనేక అభివృద్ధి పనులు మధ్యలోనే నిలిచిపోయాయని, వాటికి నిధులు తీసుకురావాలన్నారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శేఖర్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నయిమొద్దీన్, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.